విశాల మార్గం.. ఇరుకుమయం

- ఐవోసీ ప్లాంట్ రహదారికి ఇరువైపులా లారీల పార్కింగ్
- సర్వీస్ రోడ్డు మధ్యలో పశు సంచారం
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహన చోదకులు
- సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి



ఐవోసీ టెర్మినల్ ప్లాంట్ సర్వీస్ రోడ్డులో ఇరువైపులా పార్క్‌చేసిన ఆయిల్ ట్యాంకర్లు, రోడ్డు మధ్యలో సంచరిస్తున్న పశువులు

మల్కాపురం: ప్రజల సౌకర్యార్థం విశాలంగా నిర్మించిన రహదారి ఇరుగ్గా మారింది. ఒకప్పుడు ఈ మార్గంలో సాఫీగా రాకపోకలు సాగించిన పాదచారులు, వాహన చోదకులు ఇప్పుడు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మల్కాపురానికి అతి సమీపాన ఐవోసీ టెర్మినల్ ప్లాంట్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డు దుస్థితి ఇది. ఈ రహదారి 60 అడుగుల విస్తీరణంతో ఉంటుంది. ఇక్కడి శ్రీచింతామణి దుర్గాగణపతి ఆలయానికి, ఐవోసీ, బీపీసీ టెర్మినల్ ప్లాంట్లకు వెళ్లే వారి కోసం విశాలమైన మార్గాన్ని నిర్మించారు. ఐవోసీ ప్లాంట్‌కు ఆయిల్ లోడ్ల కోసం ఇతర ప్రాంతాల నుంచి రోజూ వచ్చే లారీల డ్రైవర్లు ఈ మార్గానికి ఇరువైపులా రోజుల తరబడి తమ వాహనాలను పార్క్‌చేసి ఉంచుతున్నారు. దీని వల్ల 60 అడుగుల రోడ్డు కాస్తా పదడుగుల రోడ్డులా మారింది. పలువురు కాపరులు తమ పశువులను ఇదే మార్గంలో నిర్లక్ష్యంగా విడిచిపెడుతున్నారు. దీంతో ఇక్కడి దేవాలయానికి వచ్చే భక్తులు, హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులకు వచ్చే కార్మికులు ఇబ్బంది పడుతున్నారు.

రాంగ్ పార్కింగ్, పశు సంచారం

ఐవోసీ సంస్థ వారి ప్లాంట్‌కు వస్తున్న వాహనాల కోసం పార్కింగ్ స్థలాన్ని కేటాయించింది. ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు మాత్రం అక్కడ నిలపకుండా ఇలా సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ నిబంధనలు మీరి లారీలను పార్క్‌చేసి వదిలేస్తున్నారు. ఆయిల్ ట్యాంకర్ల రాంగ్ పార్కింగ్, పశువుల సంచారంతో మార్గం ఇరుగ్గా మారి రాకపోకల సమయంలో తంటాలు పడుతున్నామని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. ఈ సమస్యలపై అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



విశాలమైన ఐవోసీ ప్లాంట్ మార్గంలో చాలా మంది నిర్లక్ష్యంగా లారీలను పార్క్‌చేస్తున్నారు. ఈ మార్గంలో పలువురు పశువులను విడిచిపెడుతున్నారు. దీని వల్ల సర్వీస్ రోడ్డులో నడవలేని పరిస్థితి ఏర్పడింది.

– వినయ్ చట్టి, మల్కాపురం

అధికారులు చర్యలు చేపట్టాలి



ఐవోసీ ప్లాంట్ రహదారిలో ఒక వైపు ఆయిల్ ట్యాంకర్ల పార్కింగ్, మరో వైపు పశువుల సంచారంతో అసౌకర్యంగా ఉంది. ఈ మార్గంలో ద్విచక్ర వాహనంపై రాలేనంత ఇబ్బందిగా మారింది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చైతన్య, సింధియా న్యూకాలనీ

చర్యలు తీసుకుంటాం

ఐవోసీ ప్లాంట్ రహదారికి ఇరువైపులా నిర్లక్ష్యంగా ఆయిల్ లారీలను నిలుపుతున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. గతంలో వీరిని హెచ్చరించాం. మరి కొంతమందికి జరిమానాలు విధించాం. మళ్లీ ఇటువంటి వాటిపై కఠినంగా ఉంటాం.

– జి.అప్పారావు, మల్కాపురం ట్రాఫిక్ ఎస్‌ఐ

బీసీజీ వ్యాక్సినేషన్‌కు విశేష స్పందన



బీసీజీ టీకా వేస్తున్న సచివాలయ ఏఎన్‌ఎం



వ్యాక్సినేషన్ శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని సచివాలయాల్లో గురువారం నిర్వహించిన బీసీజీ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. టీబీ వ్యాధి పూర్తిగా నిర్మూలించేందుకు చేపట్టిన ప్రత్యేక టీకా శిబిరానికి ఆయా సచివాలయాల పరిధిలోని వృద్ధులు స్వచ్ఛందంగా తరలివచ్చి టీకా వేయించుకున్నారు. సచివాలయ ఏఎన్‌ఎంలు కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వ్యాక్సినేషన్ శిబిరాలను యూపీహెచ్‌సీ వైద్యురాలు రొంగలి రేవతి, హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి పర్యవేక్షించారు. టీబీ వ్యాధి నివారణలో భాగంగా ఆయా సచివాలయాల పరిధిలో 60 ఏళ్లు వయసు దాటిన అందరికీ బీసీజీ వ్యాక్సినేషన్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధుల్లో ఎక్కువగా టీబీ వ్యాధి వ్యాప్తి చెందుతున్నందున, దీన్ని నిర్మూలించే క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులంతా తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. వృద్ధులందరికీ బీసీజీ వ్యాక్సినేషన్ వేసేలా మరోమారు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తామన్నారు. దీనిపై సచివాలయ ఆరోగ్య సంరక్షణ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

బౌద్ధాలయంలో పౌర్ణమి పూజలు



బుద్ధుడి పూజల్లో పాల్గొన్న బౌద్ధ సమాజం సభ్యులు, మహిళలు

కంచరపాలెం: కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో గురువారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. బుద్ధుడి విగ్రహాన్ని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కోన వెంకటరావు ఉపాసకుడిగా వ్యవహరించారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. మహిళలకు చీరలు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్.బాబూరావు, సూర్యారావు, జి.రాజు, భీమారావు, పి.అప్పారావు, సునీల్, బర్మాక్యాంప్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు

కంచరపాలెం: బర్మాక్యాంప్ బౌద్ధాలయంలో జిల్లా మహా బోధి సొసైటీ, గ్రామాధ్యక్షులు, బౌద్ధాలయ నిర్వాహకుడు సాకేటి రవి ఆధ్వర్యంలో గురువారం బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు, బౌద్ధ ఉపాసకుడు జి.బాబులు పంచశీలా పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథి బర్మా ఆంధ్రా కాందిశీకులు, కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి గునుపూడి అరుణ్‌బాబు బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యమన్నారు. కార్యక్రమంలో ధరణ సత్యనారయణ, మట్ట కిరణ్, ఎం.కిషోర్, నవీన్, నాగరాజు, కనకరాజు, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు



లలిత పారాయణం చేస్తున్న మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధిలోని కృష్ణాలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవిజ్ఞాన మండలి యాదవ్ సంఘ పాలక సభ్యుల ఆధ్వర్యంలో యాదవ సామాజిక వర్గ మహిళలు కృష్ణుడి ఉత్సవ విగ్రహానికి పాలు, పెరుగులతో అభిషేకాలు చేశారు. అనంతరం లలిత పారాయణం, గోవింద నామాలను పఠించారు. యాదవ సంఘం పాలక వర్గ ప్రతినిధులు, సభ్యులు, కుల పెద్దలు, సలహాదారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పిలకవానిపాలెం, అలూఫ్లోరైడ్ 11 కేవీ ఫీడర్ల వద్ద వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పిలకవానిపాలెం, అన్నపూర్ణనగర్, ఉప్పర కాలనీ, శ్రీరామ్‌నగర్, గొందేశివానిపాలెం, గుల్లలపాలెం, శ్రీనివాస్‌నగర్, కోడిపందాల దిబ్బ, రామ్‌నగర్, కుంచమ్మకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మల్కాపురం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాన్నాం 12 గంటల వరకు ప్రకాష్‌నగర్, వెంకన్నపాలెం, ఏడడుగుల రోడ్డు ఏరియా, కృష్ణ బార్ లైన్ ఏరియా, హరిజన వీధి, మల్కాపురం మార్కెట్ వీధి, జాలర వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని ఈఈ బి.కె.నాయుడు కోరారు.

సాయి మందిరానికి వెండి వస్తువుల బహూకరణ



బాబాకు వెండి పంచహారతి స్టాండ్ సమర్పిస్తున్న భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం, మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయానికి స్థానిక భక్తుడు వెండి పంచహారతి స్టాండ్‌ను బహూకరించారు. వైశాఖ మాసం సందర్భంగా బాబా మందిరంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పలువురు భక్తులు పాల్గొని, హారతి ఇచ్చారు. మధ్యాహ్నం బాబా మందిరం వద్ద రెండు వందల మందికి అన్నసమారాధన చేశారు. సాయంత్రం పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఆలయ ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



చిన్నారులకు కళాకృతులు నేర్పుతున్న ట్రైనర్

మల్కాపురం: చిన్నారులకు తల్లిదండ్రులు నిత్యం పౌష్టికాహారాన్ని అందించాలని, తద్వారా వారు ఆరోగ్యవంతులుగా నిలుస్తారని ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం చిన్నారులకు చిత్రలేఖనం, పలు వ్యర్థాలతో కళాకృతుల తయారీలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలువులను చిన్నారులు వృథా చేయరాదన్నారు. తమ ఇంటికి సమీపంలోని గ్రంథాలయాల వద్దకు వెళ్లి రోజులో ఒక గంట విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు చదవాలని సూచించారు. నచ్చిన క్రీడల్లో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు.కార్యక్రమంలో పలువురు అతిథులు చిన్నారులను ఉద్దేశించి మాట్లాడారు.

దివ్యాంగులు బడిబాట పట్టేలా..

- ప్రత్యేక అవసరాల పిల్లల కోసం సర్వే
- ఇప్పటి వరకు 17 మంది చిన్నారుల గుర్తింపు



భవిత కేంద్రం



ఇంటింటి సర్వేలో ఎం.సూర్యనారాయణ

పెదగంట్యాడ: దివ్యాంగులను బడిబాట పట్టించే దిశగా ప్రత్యేక చర్యలు ప్రారంభమయ్యాయి. చదువుకు దూరమైన ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాలల్లో చేరని వారితో పాటు మధ్యలో విద్యకు దూరమైన వారి వివరాలను సైతం సేకరిస్తున్నారు. చదువు వల్ల కలిగే ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న రాయితీలను గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఈ సర్వేలో భాగంగా ఇప్పటికే మండలంలో 17 మందిని గుర్తించారు. వారంతా బడికి వచ్చేందుకు ముందుకు వచ్చారని భవిత కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు.

ఇంటింటి సర్వే

సామాన్య విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను కూడా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అనేక కార్యక్రమాలు చేపడుతోంది. వీటిపై అవగాహన లేకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు వీటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. వారికి సహిత విద్యను అందించే కేంద్రాలున్నాయని తెలియకపోవడంతో చదువుకు దూరమై, ఇళ్లకే పరి మితమై ఉండిపోతున్నారు. ఇప్పుడు ఇలాంటి వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నారు. ఈ నెల 1న ఈ సర్వే ప్రారంభమైంది. ప్రస్తుత వేసవి సెలవుల సమయాన్ని దీని నిమిత్తం వినియోగిస్తున్నారు. పాఠశాలలు తెరిచే నాటికి గుర్తించిన వారందరినీ బడుల్లో చేర్పించేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేశారు.

ఎన్నో ప్రయోజనాలు

- ప్రత్యేక అవసరాల గల పిల్లలను బడుల్లో చేర్పించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని అధికారులు తెలియజేస్తున్నారు.
- చదువుకునే దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు ఉచితంగా మంజూరు చేస్తున్నారు.
- నెలకు రూ.300 చొప్పున రవాణా చార్జీలు చెల్లిస్తున్నారు.
- వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా ట్యాబ్‌లు అందజేస్తారు.
- వైకల్య శాతం అధికంగా ఉన్న వారికి సదరం ధ్రువ పత్రాలతో పింఛన్ లభించేలా చూస్తారు.
- బస్సులు, రైళ్లలో ప్రయాణం చేయడానికి పాస్ సదుపాయం కల్పిస్తారు.
- పాఠశాలలకు రాలేని వారి ఇళ్లకు ఉపాధ్యాయులే వచ్చి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలాంటి వారికి పాఠశాలకు వచ్చినట్లే హాజరు నమోదు చేస్తారు.

రోడ్డు పైనే డెబ్రిస్



పేరుకుపోయిన డెబ్రిస్ గుట్టలు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం ప్రధాన రహదారి పక్కన గృహ నిర్మాణ వ్యర్థాలు గుట్టలుగా పడి ఉన్నాయి. దీనిపై సచివాలయ కార్యదర్శులకు జీవీఎంసీ శానిటరీ విభాగం ఇన్‌స్పెక్టర్ సమాచారమిచ్చినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మానసిక ఆస్పత్రికి యువకుడి తరలింపు



ఆస్పత్రిలో మతి స్థిమితం లేని పవన్‌కుమార్‌ను చేర్పిస్తున్న పోలీసులు

గోపాలపట్నం: మతి స్థిమితం లేని ఓ యువకుడిని ఎయిర్‌పోర్ట్ పీఎస్ పోలీసులు మానసిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. 52వ వార్డు కరాసాకు చెందిన పవన్‌కుమార్ కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. స్థానికంగా వీధిలో నివసిస్తున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. తల్లి ఒక్కరే ఉండటంతో పోలీసుల సాయం కోరింది. సుమారు ఆరుగురు పోలీసులు పవన్‌కుమార్‌ను చినవాల్తేర్ మానసిక ఆస్పత్రికి తరలించి చేర్పించారు. పోలీసులు చేసిన సాయాన్ని పలువురు కొనియాడారు.

ఉక్కు కార్మికులపై రోజుకో గుదిబండ

- పోరాట కమిటీ నాయకుల ఆగ్రహం
- 1197వ రోజుకు రిలే దీక్షలు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అగనంపూడి: ఉక్కు కార్మికులపై యాజమాన్యం రోజుకో గుదిబండ మోపుతోందని విశాఖ ఉక్కు కార్మిక సంఘం నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలోని ముఖద్వారం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు గురువారానికి 1197వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ఉపక్క కర్మాగారాన్ని హోల్‌సేల్‌గా అమ్మేయడానికి కుతంత్రాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న ఉక్కు ఉన్నతాధికారులు, కార్మికులు నివాసముంటున్న క్వార్టర్స్ విద్యుత్ చార్జీలను రెట్టింపు చేయడం అన్యాయమన్నారు. పెంచిన చార్జీలు వెంటనే ఉప సంహరించుకోవాలన్నారు. కార్మికులను రోజుకో విధంగా ఇబ్బంది పాల్జేయాలని చూస్తున్నారని, ఓపక్క జీతాలు చెల్లించకుండా మరోపక్క అదనపు భారం మోపడానికి యాజమాన్యం ప్రయత్నించడం దారుణమన్నారు. పోరాట కమిటీ నాయకులు డీసీహెచ్. వెంకటేశ్వరరావు, సుబ్బయ్య, డొక్కా నరసింహారావు మాట్లాడుతూ 2017 నుంచి వేతనాల సవరణ చేయకుండా కార్మికులను ఆర్థికంగా దెబ్బతీస్తున్న యాజమాన్యం, కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ అధికారులు రోజుకో డ్రామాకు తెరలేపుతున్నారని ఆరోపించారు. ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాస్, శ్రీనివాసనాయుడు, కె.వెంకటరావు, రమణమూర్తి, మహిళా నేత ఆదమ్మ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు రెండో విడత చందనం సమర్పణ

- విశేషంగా స్వామికి పంచకలశ స్నపనం
- చందనంతో దర్శనమిచ్చిన అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి



స్వామికి పంచకలశ స్నపనం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం రెండవ విడత చందన సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారు జాము రెండు గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం మూడు మణుగుల చందనాన్ని స్వామికి సమర్పించారు. అనంతరం ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు విశేషంగా పంచకలశ స్నపనం నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. గంగా జలాలు, పంచామృతాలతో స్నపనం నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

కమనీయం.. కల్యాణోత్సవం



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు



పాలు, పెరుగు, జలాలతో ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేస్తున్న అర్చకులు

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు గురువారంతో ముగిసాయి. ఈనెల 18వ తేదీన స్వామి వారి తిరు కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈ నెల 19వ తేదీన స్వామి వారి తిరు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఉదయం అష్టోత్తర శత కలశ స్నపనం, తిరుమంజనసేవ, వసంతోత్సవం, చక్ర తీర్థం నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి వీరరాఘవాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కలశాలలో నింపిన పాలు, పెరుగు, గంధం, పసుపు నీటితో శ్రీచక్రంతో పాటు ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. ముందుగా పూర్ణాహుతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారికి భక్తి శ్రద్ధలతో చక్రస్నానం చేశారు. సాయంత్రం ధ్వజావరోహణం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామ స్మరణంతో బల్లిగిరి మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్ర హారతి, సప్త హారతులు నిర్వహించారు.

నేడు పుష్పయాగం..

కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం పుష్పయాగం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయ్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి ఊంజల్ సేవ అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

నేడు జాబ్‌మేళా

గాజువాక: టెక్ మహీంద్రలో వివిధ ఉద్యోగాల భర్తీకి స్థానిక చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమహాలక్ష్మి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ (ఏపీఐటీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్ మేళా ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానుందని పేర్కొన్నారు. బీఎస్సీ, బీకాం, బీబీఏ, ఉత్తీర్ణులైన వారితో పాటు ఆయా డిగ్రీలకు సంబంధించిన ఫైనలియర్ విద్యార్థులు కూడా ఈ జాబ్ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. 32 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులు తమ రెజ్యూమ్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సర్టిఫికెట్‌లతో జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖలోనే పని చేయాల్సి ఉంటుందని, సంవత్సర ప్యాకేజీ రూ.1.69 లక్షల నుంచి రూ.1.90 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల సోదాలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

గాజువాక: ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని గాజువాక పోలీసులు గురువారం సమస్యాత్మక ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. డీసీపీ మేకా సత్తిబాబు నేతృత్వంలో సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, గాజువాక సీఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో బొజ్జన్న కొండ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి తనిఖీలను నిర్వహించారు. ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు సాగిన ఈ కార్యక్రమంలో సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్టు ఏసీపీ తెలిపారు. వచ్చేనెల 4న ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవరకు సమస్యాత్మక ప్రాంతాల్లో సోదాలు జరుగుతాయని పేర్కొన్నారు. రౌడీషీటర్ల కదలికలపై కూడా నిఘా పెట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

16 మంది నిరాశ్రయులకు ఆశ్రయం



వసతి గృహానికి తరలించిన నిరాశ్రయులు

అల్లిపురం : ఏయూటీడీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన రెస్క్యూ ఆపరేషన్‌లో 16 మంది నిరాశ్రయులను గుర్తించారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో బిచ్చమెత్తుకుంటూ, రోజుల తరబడి అక్కడే తిష్ట వేసుకుని ఉంటున్న వారందరికీ టీఎస్ఆర్ కాంప్లెక్స్, మెన్ అండ్ ఉమెన్ షెల్టర్లలో ఆశ్రయం కల్పించారు. వారిలో 13 మంది మగవాళ్లు, ముగ్గురు మహిళలు ఉన్నారు. భిక్షాటనకు అలవాటు పడి వీళ్లలో కొంత మంది బయటికి వెళ్లిపోతామని గొడవ చేయటంతో, వారికి కౌన్సెలింగ్ నిర్వహించి యాచక వృత్తి నుంచి దూరం చేసే ప్రయత్నం జరుగుతుందని ఏయూటీడీ కార్యదర్శి పి.వాసు తెలిపారు.